క్లుప్తంగా

విద్యార్థినులకు నోట్ పుస్తకాల అందజేత



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కోటిలింగం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ప్రిన్సిపాల్ కవల కోటిలింగం నోటు పుస్తకాలు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు చదువుతున్న 210 మంది విద్యార్థినులకు కలిపి మొత్తంగా 1,432 పాఠ్య పుస్తకాలు, 2,604 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. కళాశాలకు వచ్చిన పుస్తకాలను విద్యార్థినులకు గత మూడు రోజులుగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్ యాళ్ల సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



ఆదినారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు, ప్రజాప్రతినిధులు

అల్లవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన బొల్లం ఆదినారాయణను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన హైస్కూల్లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆదినారాయణ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీను, ఎన్ సుదర్శనరావు, బండిగుప్తాపు రంగ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

అల్లవరం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్లౌడ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ లోవబాబు క్లౌడ్ కంప్యూటింగ్‌లో అకౌంట్ ఎలా క్రియేట్ చేసుకోవాలో, డేటాను స్టోర్ చేసుకుని ప్రాజెక్టులో ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

8న పేరెంట్స్ కమిటీ ఎన్నికలు

అల్లవరం: విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 8న మండలంలోని 62 ఎంపీపీ, 6 యూపీ, 9 హైస్కూల్స్, 2 గురుకులాల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కిరణ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురిని ఎన్నుకుంటామన్నారు. యూపీ పాఠశాలల్లో 24 మంది, ఎంపీపీ, హైస్కూళ్లలో 15 మంది చొప్పున ఎన్నుకుంటామని చెప్పారు. అనంతరం ఎన్నుకున్న సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారని తెలిపారు. పేరెంట్స్ కమిటీ ఎన్నికలో పాల్గొనే విద్యార్థి తల్లిదండ్రులు ఆధార్ లేదా ఓటరు కార్డుతో సంప్రదించాలని సూచించారు.

కులమతాలకు అతీతంగా వైద్య సేవలందించాలి



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: కుల మతాలకు అతీతంగా ప్రజలందరికీ వైద్యసేవలు అందించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. సోమవారం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల తాళ్లరేవు ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది పనితీరుపై అనేక ఆరోపణలు వచ్చాయని, ఇకపై అటువంటివి సహించేది లేదన్నారు. ఆస్పత్రిలో ఇటీవల ఒక వ్యక్తికి యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించినా మృత్యువాత పడడంపై అసహనం వ్యక్తం చేశారు. సామాజిక ఆస్పత్రి నూతన అభివృద్ధి కమిటీ సభ్యులుగా రోళ్ల చక్రవర్తి, అత్తిలి బాబూరావు, వాకపల్లి సరోజలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శిరీష, కె.శివన్నారాయణ, టి.లక్ష్మణరావు, సూర్యనారాయణ, బూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి.. రైతుకు దన్ను

- ఉపాధి హామీ ద్వారా కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లెం తవ్వకాలు
- ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రెండేళ్లకోసారి అవకాశం



ఓడలరేవులో కొబ్బరి చెట్టు చుట్టూ పళ్లెం ఆకారంలో కందకాలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

అల్లవరం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 100 రోజుల పాటు ఉపాధిని కల్పించి వారికి ఆర్థిక భరోసా అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. అయితే ఉపాధి పథకం ద్వారా గుర్తించిన పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ తీసుకున్న నిర్ణయం రైతులకు ఎంతగానో మేలు చేకూరుస్తుంది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన ఫారమ్ పాండ్స్ తవ్వకాలు, కొబ్బరి తోటల్లో కొబ్బరి చెట్లకు పోషకాలు అందించేందుకు, నీరు పెట్టేందుకు పళ్లెం ఆకారంతో కందకాల తవ్వకాల పనులు చేపడుతున్నారు. ఉపాధి జాబ్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు ఉపాధి కూలీల ద్వారా కందకాల తవ్వకాలు జరుపుకోవచ్చు. ఎకరానికి 80 నుంచి 100 కొబ్బరి చెట్లకు పనులు నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది అంచనాలు సిద్ధం చేసి గ్రామసభలో ఆమోదించిన పనులకు నిధులు మంజూరు చేస్తారు. అనంతరం ఉపాధి కూలీలతో ఆయా పనులు చేయిస్తారు. రెండేళ్లకోసారి ఈ పథకం ద్వారా కందకాల తవ్వకాలు చేసుకోవడానికి కొబ్బరి రైతులకు అవకాశం ఉంది. దీంతో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకు ఎంతగానో మేలు చేకూరుతోంది. ప్రస్తుతం అమలాపురం నియోజవర్గ పరిధిలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో కొబ్బరి చెట్లకు పళ్లెం తవ్వకాల పనులు జోరుగా సాగుతున్నాయి.

అమలాపురం నియోజకవర్గంలో పనుల వివరాలు

మండలం	గుర్తించిన పనులు	పనిదినాలు	నిధులు	పనులు చేయించుకుంటున్న రైతులు
అల్లవరం	130	14,135	రూ.42.40 లక్షలు	180 మంది
ఉప్పలగుప్తం	77	12,966	రూ.34 లక్షలు	87 మంది
అమలాపురం	57	9,160	రూ.27.48 లక్షలు	57 మంది

కొబ్బరి రైతుకు ఆర్థిక ప్రయోజనం



ఎరువులు వేసేందుకు కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లెం ఆకారంలో తవ్వకాల పనులను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్నారు. మా కుటుంబానికి చెందిన 450 కొబ్బరి చెట్లకు పనులు జరుగుతున్నాయి. కొబ్బరి చెట్ల చుట్టూ తవ్వకాలు జరపాలంటే ఎకరానికి రూ.6 వేల వరకూ ఖర్చవుతుంది. ఉపాధి హామీ పథకంలో ఈ పనులు నిర్వహించడం ద్వారా కొబ్బరి రైతుకు ఆర్థిక ప్రయోజనం లభిస్తుంది.

– కొల్లు త్రిమూర్తులు, కొబ్బరి రైతు, ఓడలరేవు

హెక్టారుకు రూ.15 వేల వరకూ ఆదా

ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు పని కల్పించడంతో పాటు కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేస్తున్నాం. దీనివల్ల రైతులకు ఒక హెక్టార్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ ఆదా అవుతుంది. కొబ్బరి చెట్లకు పళ్లాలు ఏర్పాటు చేయాలనుకునే రైతులు ఫీల్డ్ అసిస్టెంట్లను కలిసి పట్టాదారు పాసుపుస్తకం, ఉపాధి కార్డు సమర్పించాల్సి ఉంటుంది. గ్రామసభ ద్వారా తీర్మానం చేసిన తరువాత పనులు చేయిస్తాం.

– వి.శ్రీనుబాబు, ఏపీఎం, అల్లవరం

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్‌ఐలు



ఎస్‌ఐ సత్యనారాయణ



ఎస్‌ఐ జ్వాలాసాగర్

తాళ్లరేవు: మండలంలోని కోరంగి నూతన ఎస్‌ఐగా పి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ ఎస్.రవికుమార్ సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎస్‌ఐగా జ్వాలాసాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన డి.సురేష్‌బాబు మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో జ్వాలాసాగర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఐశ్వర్యకు నర్తనబాల అవార్డు



ఐశ్వర్యకు నర్తనబాల అవార్డును ప్రదానం చేసి సత్కరించిన సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకళా క్షేత్రం నృత్య విద్యార్థిని తురగా భాను ఐశ్వర్యకు ఏలూరు అభినయ నృత్య భారతి సంస్థ నర్తనబాల అవార్డును ప్రదానం చేసింది. ఏలూరులో ఆదివారం రాత్రి జరిగిన 9వ జాతీయ స్థాయి నర్తన బాల అవార్డుల మహోత్సవంతో బాలిక ఐశ్వర్యకు ఈ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. చిన్నారి ఐశ్వర్యను అమలాపురం శ్రీకళాక్షేత్రం డైరెక్టర్ పి.కామేశ్వరీదేవి, నృత్య గురువు పి.దుర్గారావు, బాలిక తల్లిదండ్రులు సూర్య శ్రీనివాస్, సీతా కల్యాణి అభినందించారు.

ధాన్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

అమలాపురం రూరల్: ప్రభుత్వం ధాన్యం బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని, నూటికి 70 శాతం భూమి కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. కౌలు వ్యవసాయం లాభదాయకంగా లేకపోయినా, పశువులకు మేత దొరుకుతుందన్న ఆశతో చేస్తున్నారని చెప్పారు. కౌలు రైతులందరికీ భూయజమాని సంతకం నిబంధన లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు సైతం విపరీతంగా పెరుగుతున్నాయన్నారు.

కార్యక్రమంలో బుంగ సత్యనారాయణ, శ్రీరామ్ మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో బూలవారిపేట ఆనుకుని ఉన్న పేద రైతుల భూమికి సాగు నీరు వెళ్లకుండా పంట బోదెను ఆక్రమించిన భూస్వామి సాపే సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

కాంక్రీటు గోడను నిర్మించాలి

బోడసకుర్రు బ్రిడ్జి నుంచి కరకట్ట వరకూ కాంక్రీటు గోడ నిర్మించాలని కలెక్టరేట్ వద్ద మత్స్యకార నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లవరం మండలం బోడసకుర్రు, రెబ్బనపల్లి గోదావరి నది ఒడ్డున కరకట్ట లేకపోవడం వల్ల గ్రామంలోకి వరదనీరు వచ్చి చేరుతోందన్నారు. చేపల వేటకు వెళ్లకపోవడం వల్ల ఆర్థికంగా కష్టాలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటి సెక్రటరీ చింతా శ్రీనివాసరావు, నాగూర్, మీరా జగతాడి, రాఘవులు, సంగాని వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్లు, కుక్కర్ల అందజేత



కొంకాపల్లి అంగన్‌వాడీ సిబ్బందికి సోలార్ లైట్లు, కుక్కర్లు అందజేస్తున్న రీజినల్ మేనేజర్ కృష్ణ

అమలాపురం రూరల్: స్థానిక ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో పేరూరు పరిధిలోని కొంకాపల్లి బాపూజీ విద్యానగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సోలార్ లైట్లు, కుక్కర్లతో పాటు చిన్నారులకు ఆటవస్తువులు, కంచాలు, గ్లాసులను సమకూర్చారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎంవీవీ కృష్ణ సోమవారం ఆయా వస్తువులను అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి అరుణకుమారి, ఎంపీటీసీ పనసా బుజ్జి, ఎస్‌బీఐ మేనేజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన సదస్సు



గిరియాంపేట అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: మత్స్యకారులు వేటకు వినియోగించే బోటు ఇంజిన్లలో తలెత్తే లోపాలు, వాటి నిర్వహణ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించే అవగాహన సదస్సును ఆర్ఏఓ ఆర్.మునిస్వామి సోమవారం ప్రారంభించారు. యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరియాంపేట జూనియర్ కళాశాల ప్రాంగణంలో సావిత్రినగర్, గిరియాంపేట మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మునిస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పీఎంఎంఎస్‌వై పథకం కింద ఎస్ఏఫ్‌డీబీ నిధులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పుదుచ్చేరి సీఏఎఫ్ఎస్ఐటీ అధికారులు వీఎల్ పూజార్, శ్రీహరనాథ్, అర్జున్‌లు మత్స్యకారులకు బోటు ఇంజిన్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గౌంతియ్య తదితరులు పాల్గొన్నారు.

స్టాపర్లను ఢీకొట్టిన మోటారు సైక్లిస్టు

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లను ఓ మోటారు సైక్లిస్టు సోమవారం బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి 108లో తరలించారు. కాగా మోటారు సైక్లిస్టు వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులంతా సమావేశాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు

అమలాపురం రూరల్: ఈ నెల 8వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికల నిమిత్తం మండల స్థాయి ఉపాధ్యాయులంతా సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో గుబ్బల మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో సరేళ్ల దుర్గాదేవి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి సహకరించే విద్యార్థుల తల్లిదండ్రులను కమిటీలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ ఎంఏకే భీమారావు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుబ్బల సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడా పోటీలు



జోనల్ పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయులు

యానాం: స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జోనల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం చెస్ పోటీల విజేతలను యానాం విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. చెస్ అండర్-14 బాలుర విభాగంలో రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలవగా, గిరియాంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, మెట్టకూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-17 చెస్‌లో రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రథమ, యానాం పబ్లిక్ స్కూల్ ద్వితీయ, రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ తృతీయ స్థానాలను సాధించాయి. అదేవిధంగా అండర్-17 బాలుర విభాగంలో ప్రిలిమినరీ వాలీబాల్ పోటీలను నిర్వహించారు.

8న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: చెన్నైకు చెందిన ప్రముఖ ప్రైవేట్ కంపెనీ కేఎల్ గ్రూప్‌లో పనిచేయుటకు ఈ నెల 8వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి అమలాపురం జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి తెలిపారు. పదో తరగతి చదివినవారు అర్హులని, ఆసక్తి గల వారు తమ పూర్తి బయోడేటాతో హాజరవ్వాలని కోరారు. ఎంపికైన వారికి నెలకు రూ.18 వేల వరకూ జీతం లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 81218 38392 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు గనికమ్మ ఆలయ వార్షికోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక వంటెద్దువారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీగణపతి, గనికమ్మ అమ్మవారి ఆలయం 19వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు గనికమ్మ అమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు జరుపుతామన్నారు. ఈ నెల 13వ తేదీన అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



ఉప్పలగుప్తంలో నిరసన చేస్తున్న దళిత నాయకులు

ఉప్పలగుప్తం: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలంటూ సోమవారం ఉప్పలగుప్తంలో దళితులు నిరసన నిర్వహించారు. మాల మహానాడు మండల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీఎస్ దివాకర్‌కు దళిత నాయకులు అందజేశారు. ఈ నెల 11న అమలాపురంలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమంలో దళితులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డలకు ఆరోగ్యం



విలసవిల్లిలో బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



గచ్చకాయలపోరలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ఎస్‌బీపేటలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఉప్పలగుప్తం: అత్యధిక ఔషధాలతో కూడిన తల్లి పాలను పిల్లలకు అందిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా జీవిస్తారని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో సోమవారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం కలిగే ప్రయోజనాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు. అనంతరం పౌష్టికాహార కిట్లను బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, హెల్త్ సూపర్‌వైజర్ శుభారత్నం, అనురాధ, తేజ, మీరాబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

కాట్రేనికోన: మండలంలోని గచ్చకాయలపోర, నాగపట్టణం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ ఐ.విమల మాట్లాడుతూ నవజాత శిశువుకు ముర్రు పాలతో పాటు ఆరు నెలల వరకూ తల్లి పాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం సమాజంలో అధిక సంఖ్యలో మహిళలు బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌ను తరిమి కొట్టొచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు తులసి, ఎల్‌వీ రమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు తల్లిపాలు అందించాలి

ఐ.పోలవరం: సాధారణ ప్రసవం తరువాత అరగంటలోపు, అసాధారణ ప్రసవంలో కనీసం గంటన్నర లోపు బిడ్డకు తల్లిపాలు అందించాలని ఐ.పోలవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివ గాయత్రి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఎస్‌బీపేట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో తల్లిపాల ప్రాముఖ్యతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకూ తల్లిపాలను అందించాలని సూచించారు. అనంతరం 15 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ నాగలక్ష్మి, గుత్తినదీవి సెక్టార్ విస్తరణాధికారి జె.మీనాక్షి, సాగిరాజు సూరిబాబు, హెచ్ఎం గంటా సూర్యసుబ్రహ్మణ్యం, కాకర్లపూడి రాజేష్, శివ, యిళ్ల సూరిబాబు, యిళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

అంబాజీపేట: నివాస ప్రాంతాలు, ప్రాంగణాల్లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్ అన్నారు. మాచవరంలో పారిశుధ్య పనులను సోమవారం నిర్వహించారు. దోమలను నియంత్రించేందుకు చెత్తాచెదారం, నిల్వ నీటిని ఉంచరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బ్లీచింగ్, ఎబేట్ మందు స్ప్రే చేయించారు.

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించండి

ప్రస్తుత వాతావరణంలో డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం చేయించుకోవాలని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జై భీమ్ నగర్‌లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును సోమవారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి జ్వర పీడిత రోగులను గుర్తించి వైద్య సేవలందించాలన్నారు.

గోదావరి కోతపై రైతుల ఆందోళన



నదీకోతను నివారించాలంటూ ధర్నా చేస్తున్న రైతులు

మామిడికుదురు: గోదావరి కోత తీవ్రంగా ఉందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాశర్లపూడి బాడవలో రైతులు సోమవారం ధర్నా చేశారు. వైనతేయ వారధి వద్ద నిరసన తెలిపారు. గోదావరి కోత నివారణకు గ్రోయన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని కోరారు. ఇటీవల వచ్చినగోదావరి వరదకు నదీకోత తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.కోట్లు విలువైన భూములు నదీగర్భంలో కలసి పోయాయని, నెల నెలా ఆదాయాన్ని ఇచ్చే కొబ్బరి చెట్లు నదిలో పడిపోయాయని వాపోయారు. ఈ సమస్య పరిష్కారంపై తక్షణం ప్రభుత్వం స్పందించాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో రైతులు తోరం నాగేంద్ర, మల్లాడి విష్ణు, నిమ్మల అప్పారావు, చవటపల్లి బులిబాబులు, మల్లాడి వీరపండు, పాలూరి సత్తిబాబు, పెమ్మాడి రామ్మూర్తి, మట్లాడి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.